క్లుప్తంగా

వెల్దుర్తి సీఐ బాధ్యతల స్వీకరణ



సురేశ్‌కుమార్ రెడ్డి

వెల్దుర్తి (కృష్ణగిరి): వెల్దుర్తి నూతన సీఐగా ఎం.సురేశ్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ఇంటెలిజెన్స్ సీఐగా ఉన్న ఈయన బదిలీపై వచ్చి వెల్దుర్తి సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, సురేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా మండలాల స్థితిగతులపై చర్చించారు. నూతన సీఐ మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఎన్‌హెచ్–44పై ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై దృష్టి సారిస్తానన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఉన్న వన్నూరప్ప జెండాకట్ట వద్ద శుక్రవారం ముస్లింలు గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక మసీదులో హజరత్‌లు ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులు నిర్వహించి ఊరేగింపు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో మత సామరస్యం చాటేలా జెండాను ఎగురవేసి ప్రార్థనలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సుల్తాన్, ఆదూరి మహేష్, ఇమాంసాహెబ్, పీరా, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

3న ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష

తుగ్గలి: స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నవంబరు 3న నిర్వహించనున్నట్లు ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన పెను మార్పులతో విద్యా ప్రమాణాలు పెరిగాయన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు చదువులో ఎంతమేర రాణిస్తున్నారో తెలుసుకునేందుకు వచ్చేనెల 3వ తేదీన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3, 8, 9 తరగతుల విద్యార్థులకు ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇన్విజిలేటర్లు పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.


రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన లాలూప్రసాద్ యాదవ్

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన లాలూప్రసాద్ యాదవ్ (30) ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విరక్తి చెంది శుక్రవారం మద్దికెర– మల్లప్పగేట్ స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న లాలూప్రసాద్ యాదవ్ పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నా కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి చనిపోయాడు. మృతుడికి గతేడాది నందిని అనే యువతితో వివాహం అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

35 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ



హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో శుక్రవారం 35.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో పూర్తి సామర్థ్యం మేరకు 105.788 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. అలాగే కాలువలకు వదులుతున్న నీరు, ఆవిరి రూపంలో డ్యాంలో నీటిమట్టం వేగంగా తగ్గతోంది. శుక్రవారం డ్యాం 1609 అడుగులతో 35.4 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. డ్యాంలో నీటి చేరిక (ఇన్‌ఫ్లో) నిలిచిపోగా కాలువలకు (అవుట్‌ఫ్లో) వదిలే నీరు 9,066 క్యూసెక్కులుంది. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 527 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

అరుణాచలంకు బస్సు సర్వీసు

ఎమ్మిగనూరుటౌన్: అరుణాచలం గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల కోసం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలంకు ప్రతి నెలా నడుపుతున్న బస్సు సర్వీసును శుక్రవారం రాత్రి 7 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ అమర్నాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు రాత్రి బయలుదేరి ఉదయం కాణిపాకం చేరుకుంటుందన్నారు. అక్కడ గణపతి దర్శనానంతరం శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని శనివారం పౌర్ణమి రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. అక్కడ గిరిప్రదర్శన అనంతరం తిరుగుప్రయాణమై 29వ తేదీన ఎమ్మిగనూరుకు చేరుకుంటుందని తెలిపారు. వచ్చే నెల 25వ తేదీన పౌర్ణమికి స్థానిక డిపో నుంచి రెండు బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మద్దికెర శిబిరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



బాపురంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్



టీఎస్.కుళ్లూరులో ఓపీ నమోదు చేసుకుంటున్న మహిళలు



తిప్పనూరులో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం



కురువళ్లి గ్రామంలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది



వెలమకూరులో వైద్య సేవలందిస్తున్న దృశ్యం

మద్దికెర: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మద్దికెర సచివాలయం–4 పరిధిలో సురక్ష వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలపై ప్రజల వద్ద ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు. తీవ్ర అనారోగ్య పరిస్థితులు ఉన్న వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం, మందులతో పాటు కోలుకునే వరకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామ పంచాయతీ బాపురం గ్రామ సచివాలయం–2లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 626 మందికి వైద్య సేవలందించారు. కంటి వెలుగు పథకం ద్వారా 86 మందికి కంటి పరీక్షలు చేసి 17 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. డాక్టర్లు పరిమళ, సౌజన్యలత, కావ్య, శ్రీచరణ్ రోగులకు చికిత్స అందించారు. ఎంపీటీసీ హనుమంతమ్మ, ఎంపీడీఓ దశరథ రామయ్య, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు. క్యాంప్‌కు వచ్చిన వారికి బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్ల కోసం సిఫార్సు చేసినట్లు వైద్యులు తెలిపారు.

గోనెగండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పనూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. డాక్టర్లు రుక్సానా, అపర్ణ, సిందూర, భానుశ్రీ 305 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అన్ని చోట్లా అనూహ్య స్పందన వస్తోంది. గ్రామాల్లోనే స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తుండడంతో ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. శుక్రవారం మండలంలోని కురువళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 290 మంది రోగులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హర్దగేరి పీహెచ్‌సీ వైద్యులు గంగాధర్, మన్సూర్ వలి, గుల్జాన్, వీణా దత్తా, వైద్యారోగ్య సిబ్బంది సేవలందించారు.

దేవనకొండ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు ప్రవీణ్‌కుమార్, ఎస్.కె.రసూల్, హరిత సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వెలమకూరు గ్రామంలో సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దాదాపు 300 మందికి పైగా రోగులు వైద్య చికిత్సలు చేయించుకున్నారు. వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద: మండల కేంద్రంలో సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు 426 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ముందులు అందజేశారు. 12 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ఎంపీడీఓ సుహాసినమ్మ, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



తుగ్గలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తుగ్గలి: రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు అవసరమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం సాయంత్రం తుగ్గలిలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్ అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మాజీ సీఎం చంద్రబాబు పాలనకు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్ర ప్రజల సొమ్ము నొక్కేసి చంద్రబాబు జైలుకు వెళ్లినా ఆయన్ను నిజాయితీపరుడిగా టీడీపీ నాయకులు చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అవినీతి, అక్రమాలను ప్రజలు గ్రహించారని, టీడీపీ నాయకులు ఎన్ని వేషాలు వేసినా ప్రజలు పట్టించుకోరన్నారు. ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పత్తికొండ నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నవంబరు 9 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. అంతకు ముందు కార్యక్రమం ఎలా నిర్వహించాలనే అంశంపై ప్రొజెక్టర్ ద్వారా పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. పార్టీ నాయకులు జగన్నాథరెడ్డి, రామచంద్రారెడ్డి, రాతన మోహన్‌రెడ్డి, తుగ్గలి మోహన్‌రెడ్డి, హనుమంతు, గోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, హుసేన్, సుధాకరరెడ్డి, నాగభూషణరెడ్డి, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, పీడీలు

ఎమ్మిగనూరుటౌన్: తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని కొండగుంటూరు హైస్కూల్‌లో శనివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్ పోటీలకు పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. 14 సంవత్సరాల్లోపు విభాగంలో శీతాక్షి, దీపిక, దక్షిత, ధరణి, విజయలక్ష్మి ఎంపికైనట్లు పీడీలు సుజనకుమారి, నాగేశ్వరి శుక్రవారం తెలిపారు. అలాగే 17 సంవత్సరాల్లోపు విభాగంలో మౌనిక, నిత్యసాయి, హారిక, అమూల్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు వెల్లడించారు. క్రీడాకారులు, శిక్షణ ఇచ్చిన పీడీలను హెచ్ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

కృష్ణగిరి: నవంబర్ 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నెల్లూరులో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలికల విభాగంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండల పరిధిలోని కటారుకొండ హైస్కూల్ విద్యార్థిని శ్రావణసంధ్య ఎంపికైనట్లు హెచ్ఎం గోవిందు రెడ్డి తెలిపారు. ఈనెల 26న నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో విశేష ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎన్నికైన క్రీడాకారిణితో పాటు శిక్షణ ఇచ్చిన పీఈటీ రంగస్వామిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

పేదలకు అండగా వైఎస్సార్ బీమా

నందవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పేదలకు అండగా నిలిచిందని సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. శుక్రవారం ముగతి గ్రామ సచివాలయం–1 పరిధిలో నామినీ నాగేంద్రమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను అందజేశారు. ఆమె భర్త బోయ ఉరుకుందు (49) అనారోగ్యంతో మృతి చెందడంతో బీమా మంజూరైంది. సర్పంచ్ మాట్లాడుతూ.. మిగతా సొమ్ము వారం రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై సమావేశం

తుగ్గలి: గ్రామాల అభివృద్ధిపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అన్ని శాఖల అధికారుల నుంచి పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టిన అభివృద్ధి, తదితర వివరాలను సేకరించారు. అన్ని పంచాయతీల నుంచి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ రవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

30న సీపీఎం బస్సుయాత్ర

వెల్దుర్తి (కృష్ణగిరి): ఈనెల 30న ఆదోని నుంచి కర్నూలు వరకు నిర్వహించే ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోరుతూ బస్సు యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు మల్లి, బద్రి, నాగన్న, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హసన్‌బేగ్ వీధిలో కొలువైన హజరత్ మెహబూబ్ సుభానీ దర్గాలో శుక్రవారం ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి దర్గాను దర్శించుకొని ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, జామియా మసీదు కమిటీ అధ్యక్షులు ఖాశింబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట



బాధితులకు చెక్కును అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆస్పరి: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఈద్గాను మంత్రి ప్రారంభించారు. ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తానని మంత్రి చెప్పారు. ఈద్గాకు కాంపౌండ్, షాదీఖానా నిర్మించాలని ముస్లిం పెద్దలు కోరగా స్పందించిన మంత్రి త్వరలోనే నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, సర్పంచ్ శ్రీను, సుంకులమ్మ, మూలింటి రాఘవేంద్ర, గోవర్ధన, అశోక్, పెద్దయ్య, సుంకర రామాంజనేయులు, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ

దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో చెట్టు విరిగి పడ్డ ఘటనలో ఆస్పరికి చెందిన గణేష్, ఆలూరు మండలం మొలగవల్లి కొట్టాలకు చెందిన రామాంజనేయులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాలకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున మంజూరు చేసింది. ఈ చెక్కులను శుక్రవారం బిల్లేకల్లులో మంత్రి గుమ్మనూరు జయరాం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

గడప గడపలో సంక్షేమ వెలుగులు



లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

నందవరం: వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నిండాయని పార్టీ నియోజకవర్గ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–3 పరిధిలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శివారెడ్డిగౌడ్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలను ఆరా తీశారు. గ్రామస్తులు అడిగిన తాగునీరు, సీసీ రోడ్లు తదితర సమస్యలను పరిష్కస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారన్నారు. నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగపడ్డాయని వివరించారు. పేదలకు నాణ్యమైన విద్య, ప్రజారోగ్యానికి భరోసా కల్పించాలనే ఉద్దేశంలో నాడు–నేడు, ఆరోగ్య సురక్ష వంటి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి గౌడ్, నిఖిల్ చక్రవర్తి, తోట సావిత్రి, రమేశప్పగౌడ్, ఎల్లాగౌడ్, భీమన్నగౌడ్, ఎంపీడీఓ దశరథ రామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు పాల్గొన్నారు.

కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజల అవసరాలకనుగుణంగా పలు వార్డుల పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో మంచినీటి పైపు లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 27వ వార్డులో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో దశల వారీగా మంచినీటి పైప్ లైన్లు, సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, ఏఈ మదన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్ అహమ్మద్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

వెల్దుర్తి (కృష్ణగిరి): ఈ ఏడాది జూలై 21 నుంచి ఇంటింటికీ తిరిగి చేపట్టిన ఓటరు జాబితా సవరణ సర్వే, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఓటరు సవరణ ముసాయిదా జాబితాను విడుదల చేశామని, దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చని తహసీల్దార్ శివరాముడు కోరారు. శుక్రవారం ఆయన మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటరు సవరణ ముసాయిదా జాబితా తన కార్యాలయంలోనూ, ప్రతి పోలింగ్ బూత్‌లోనూ అందుబాటులో ఉంటుందన్నారు. వాటిని పరిశీలించి అభ్యంతరాలున్నా, పేరు, చిరునామాలలో మార్పులవసరమైనా డిసెంబర్ 9వ తేదీలోగా సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్దికెర: రాబోవు ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 9వతేదీ వరకు ఓటరు జాబితాలో సవరణలు చేసుకోవడానికి వీలుంటుందని తహసీల్దార్ నాగభూషణం అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో విఆర్వోల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 34 పోలింగ్ కేంద్రాలున్నాయని మొత్తం 29,338 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, చనిపోయిన వారి పేర్లు, పెళ్లిళ్లు చేసుకొని వెళ్లిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించనున్నట్లు వెల్లడించారు.

గొరవయ్యల ఆటలు అద్భుతం



దేవరగట్టులో బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ

హొళగుంద: దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవంలో గొరవయ్యలు ఆటలు అద్భుతం అని బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ అన్నారు. శుక్రవారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట తదితర కార్యక్రమాలను ఆమె వీక్షించి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అలాగే కొండపై వెలసిన మాళ మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిమ కలిగిన దేవరగట్టు స్వామిని దర్శించుకుంటే కష్టాలన్నీ తీరుతాయన్నారు. ఎక్కడెక్కడి నుంచో గొరువయ్యలు దేవరగట్టుకు చేరుకుని నృత్యాలు చేయడం, వారి ఆచారాలను సంస్కృతిని చాటడం వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయన్నారు. కురువ పెద్దలు గర్జప్ప, ఎస్కే గిరి, రవిస్వామి, రమేష్, మహేశ్ తదితరులు వెంట ఉన్నారు.

సచివాలయ ఉద్యోగికి తీవ్రగాయాలు



గాయపడిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిన్నరాజు

వెల్దుర్తి (కృష్ణగిరి): జాతీయ రహదారి–44పై బొమ్మిరెడ్డిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోవర్ధనగిరి–1 సచివాలయ ఉద్యోగి (ఇంజనీరింగ్ అసిస్టెంట్) చిన్నరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ముందు వెళ్తున్న మినీ లారీని బైక్‌పై వెళ్తున్న చిన్నరాజు వెనుకనుంచి ఢీకొట్టడంతో కిందపడి తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. చిన్నరాజు నిత్యం తన స్వగ్రామం ఉలిందకొండ నుంచి హైవే మీదుగా గోవర్ధనగిరి సచివాలయానికి చేరుకుని విధులు నిర్వహించేవాడు. శుక్రవారం విధి నిర్వహణ అనంతరం స్వగ్రామానికి బయలుదేరగా మార్గమధ్యంలో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న హైవే పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

నేడు ఆలయాల మూసివేత

ఆలూరు: రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం కారణంగా దేవదాయ శాఖ పరిధిలోని అన్ని ప్రముఖ ఆలయాలను శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు మూసివేయనున్నట్లు నియోజకవర్గ ఆలయాల ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 29వ తేదీన ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు.

నలుగురికి తీవ్రగాయాలు

ఆస్పరి: మండలంలోని నలకదొడ్డి బస్‌స్టాప్ వద్ద శుక్రవారం బొలెరో, ఆటో ఢీకొన్న ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పరి నుంచి బిల్లేకల్లు వెళ్తున్న బొలెరో, బిల్లేకల్లు నుంచి ఆస్పరి వైపు వస్తున్న ఆటో నలకదొడ్డి బస్ స్టాప్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆస్పరికి చెందిన సాయి, వెంకటేష్, బళ్లారికి చెందిన నబీ, ఈరన్నకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆస్పరికి చెందిన సాయి, వెంకటేష్ ఆటోలో చిక్కుకుపోవడంతో స్థానికులు అతి కష్టంపై బయటకు తీశారు. గాయపడిన నలుగురిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.